క్లుప్తంగా

ప్రాంగణ ఎంపికల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థినుల ప్రతిభ



గుంటూరు రూరల్: ప్రతి విద్యార్థినికి ఉపాధి కల్పనే లక్ష్యంగా కృషి చేస్తున్నట్లు సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ సిస్టర్ సంధ్య తెలిపారు. శుక్రవారం నగర శివారుల్లోని గోరంట్లలోని సెయింట్ ఆన్స్ కళాశాలలో హైదరాబాద్‌కు చెందిన ఈసీఐఎల్ సంస్థ ప్రాంగణ ఎంపికలను నిర్వహించారు. ఎంపికల్లో కళాశాలకు చెందిన 28 మంది విద్యార్థినులు ఉద్యోగాలకు అర్హత సాధించారని తెలిపారు. ఉద్యోగాలకు అర్హత సాధించిన విద్యార్థినులను కళాశాల ఉపాధి కల్పనాధికారి డాక్టర్ జె.ప్రతాప్‌రెడ్డి, అధ్యాపకులు అభినందించారు.

వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలోని ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన నూతలపాటి అశోక్ కంటి రెటీనా సంబంధిత వ్యాధులపై చేసిన పరిశోధనలకు గాను ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ శ్రీ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. మండలంలోని నంబూరు కళాశాలలో శుక్రవారం అభినందన సభ నిర్వహించారు. చైర్మన్ మాట్లాడుతూ చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ నూతలపాటి అశోక్, రెటినల్ వ్యాధుల గుర్తింపు వర్గీకరణ సంబంధిత నమూనాలపై చేసిన పరిశోధనా పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ కె.గంగాధరరావు పర్యవేక్షణలో అందించడం ద్వారా ఈ డాక్టరేట్ పొందినట్లుగా తెలిపారు. అనంతరం అశోక్‌ను చైర్మన్, వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహదేవ్, ప్రిన్సిపాల్ డాక్టర్ వై.మల్లికార్జున రెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, ఐటీ విభాగాధిపతి డాక్టర్ ఆళ్ల కళావతి అభినందించారు.

విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి



పెదకాకాని: విద్యుదాఘాతంలో వ్యక్తి మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. వివరాలు.. కంకరలోడుతో వచ్చిన రెడీమిక్స్ ట్యాంకర్‌కు తగిలి సర్వీసు వైరు తెగి దానిపైనే పడింది. రాత్రి వేళ కావడంతో ట్యాంకర్ పట్టుకుని లైట్ చెబుతున్న కార్మికుడు షేక్ గఫూర్(27) విద్యుదాఘాతానికి గురయ్యాడు. హుటాహుటిన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే కార్మికుడు మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. పంచాయతీ నిధులతో రాత్రి వేళల్లో రోడ్లు, కాలువల నిర్మాణం పనులు చేపట్టడం వలనే ప్రమాదం జరిగిందని పలువురు ఆరోపిస్తున్నారు.

న్యాయవాదిపై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి



పొన్నూరు: పట్టణానికి చెందిన న్యాయవాది బేతాళ ప్రకాశరావుపై పోలీసులు పెట్టిన అక్రమ కేసును ఎత్తివేసి, అందుకు బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విజయవాడ, గుంటూరు, తెనాలి, పొన్నూరు బార్ అసోసియేషన్ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఐలాండ్ సెంటర్‌లో న్యాయవాదులపై జరుగుతున్న దాడులను ఖండిస్తూ రిలే నిరాహార దీక్షకు వారు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా విజయవాడ బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ చంద్రమౌళి మాట్లాడుతూ ఘటనకు బాధ్యులైన పట్టణ సీఐ, డాక్టర్‌పై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు. దీక్షలో పాల్గొన్న వారికి పండ్లరసం ఇచ్చి దీక్ష విరమింపజేశారు. కార్యక్రమంలో గుంటూరు, తెనాలి, పొన్నూరు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్లు కాసు వెంకటరెడ్డి, బి.ప్రభాకరరావు పి. జయరాజ్ పాల్గొన్నారు. తొలుత న్యాయవాది ప్రకాశరావుకు న్యాయం చేయాలని కోరుతూ తహసీల్దార్ మహమ్మద్ జియావుల్‌హక్‌కు వినతిపత్రం అందజేశారు. న్యాయవాదులు వర్ధన్, జీఎస్ రాయల్ పాల్గొన్నారు.

భవన యజమానులకు టీడీఆర్ బాండ్లు పంపిణీ

పొన్నూరు: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో జీబీసీ రోడ్డు విస్తరణలో భవనాలు నష్టపోయిన యజమానులకు టీడీఆర్ బాండ్లు పంపిణీ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్ పాల్గొ పట్టణంలో 60 అడుగుల రోడ్డు విస్తరణలో 168 భవన యజమానులు నష్టపోయారని, వారిలో ఇప్పటి వరకు 41 మందికి టీడీఆర్ బాండ్లు అందించినట్లు తెలిపారు. మిగిలిన వారికి మార్చి వరకు బాండ్లు అందించే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టీపీఓ డీవీ రఘురాం, ఆర్‌ఓ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



తురకపాలెం రోడ్డు దుస్థితి



దుమ్ములేస్తున్న రెడ్డిపాలెం ప్రధాన రహదారి



చల్లావారిపాలెం నుంచి వెంగళాయపాలెం వెళ్లే రోడ్డు ఇలా..

అంతా గుంతలమయం

గుంటూరు రూరల్: నడక నరకప్రాయంగా మారింది. గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. అడుగుతీసి అడుగువేసే పరిస్థితి లేదు. రోడ్లు గుల్ల కావడంతో దుమ్ముతో నిండిపోతున్నాయి. మండలంలోని తురకపాలెం, మల్లవరం, దాసుపాలెం, గోర్లవారిపాలెం, చల్లావారిపాలెంనుంచి వెంగళాయపాలెం వెళ్ళే రోడ్డు, నల్లపాడునుంచి అంకిరెడ్డిపాలెం మీదుగా వెళ్లే బైపాస్‌రోడ్డు, నల్లపాడు కాలేజ్ సెంటర్‌లో తురకపాలెం రోడ్డు, రెడ్డిపాలెం ప్రధానరహదారి అన్ని దారులు ఇలా ప్రతి గ్రామ ప్రధాన రహదారి అధ్వానంగా గుంతల మయంగా తయారయ్యాయి. మండలంలో క్రషర్‌లకు చెందిన లారీలు ఎక్కువగా అన్ని గ్రామాలనుంచి ప్రయాణిస్తుండటంతో గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు.



నల్లపాడు నుంచి ఎన్‌హెచ్ 16 వెళ్లే బైపాస్‌రోడ్డు దుమ్ములేస్తున్న దృశ్యం



చేబ్రోలులోని మోహన రంగనాథ స్వామి చందనాలంకారంలో దర్శనం



శలపాడులో ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న కోదండ రామస్వామి



పొన్నూరు శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు



ఉత్తర ద్వారం ద్వారా దర్శనమిస్తున్న శ్రీ భూ నీలా సమేత ఆదికేశవస్వామి



చిన్న భద్రాద్రిగా పేరుగాంచిన యనమదల సీతారామస్వామి ఆలయంలో ఉత్తరద్వార దర్శనానికి రంగరంగ వైభవంగా తరలిస్తున్న దేవతామూర్తులు

ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు విష్ణుమూర్తికి భక్తి ప్రపత్తులను చాటారు. ఏకాదశి వేడుకలు అత్యంత వైభవోపేతంగా జరిగాయి. చేబ్రోలులోని ఆదికేశవస్వామి దేవస్థానం, శ్రీరంగనాథ స్వామి దేవస్థానం, జ్వాలా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానాల్లో వైకుంఠ ఏకాదశి సందర్భంగా విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి ఏకాదశి సందర్భంగా భ్రమరాంబ మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులను ఉత్తర ద్వార దర్శనం భక్తులు దర్శించుకున్నారు.పొన్నూరులో వైకుంఠ ఏకాదశి వేడుకలను శుక్రవారం వైభవంగా నిర్వహించారు.

చేబ్రోలు/పొన్నూరు/పెదకాకాని/ప్రత్తిపాడు/గుంటూరు రూరల్:



ప్రత్తిపాడు వైష్ణవాలయంలో ఉత్తర ద్వార దర్శనం చేసుకుంటున్న భక్తులు



పట్టణంలోని శ్రీ సాక్షి భావన్నారాయణ స్వామి ఆలయంలో బారులు తీరిన భక్తులు



పెదకాకానిలో గ్రామోత్సవానికి బయలుదేరిన భ్రమరాంబ సమేత శ్రీ మల్లేశ్వరస్వామి

పర్యావరణ శాస్త్ర విభాగంలో జాతీయ సదస్సు



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పర్యావరణ శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో సామాజిక ఆర్థిక, పర్యావరణ ప్రగతికి అనుసరించాల్సిన వ్యూహాలపై జాతీయ సదస్సు నిర్వహించనున్నట్లు సదస్సు డైరెక్టర్ ఆచార్య పి.బ్రహ్మాజీరావు తెలిపారు. ఫిబ్రవరి 21, 22 తేదీల్లో ఈసదస్సు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం సదస్సు బ్రోచర్‌ను వీసీ కె.గంగాధర రావు ఆవిష్కరించారు. కార్యక్రమంలో కే రత్నషీలా మణి, రిజిస్ట్రార్ జి.సింహాచలం, దూరవిద్య కేంద్రం డైరెక్టర్ వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ రామచంద్రన్, పూలే అధ్యయన కేంద్రం డైరెక్టర్ త్రిమూర్తి రావు, సీడీసీ డిన్ వి.రవికుమార్, పర్యావరణ శాస్త్ర విభాగాధిపతి ఏవీవీఎస్. స్వామి, విభాగం అధ్యాపకులు వి.సుభాషిని, సిహెచ్ సునీత, కే.శశిధర్, సిహెచ్ ప్రసన్న, డాక్టర్ శాంతి, జేమ్స్ పాల్గొన్నారు.

టూరిజం విభాగం ఆధ్వర్యంలో జాతీయ వర్క్ షాప్

ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని టూరిజం హాస్పిటాలిటీ మేనేజ్మెంట్ విభాగం ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని గ్రామీణ పర్యాటకం ఆర్థిక, సామాజిక అంశాలపై దాని ప్రభావం అనే అంశంపై రెండు రోజుల జాతీయ వర్క్ షాప్ ను ఫిబ్రవరి 24, 25 తేదీలలో నిర్వహిస్తున్నట్లు వర్క్ షాప్ డైరెక్టర్, విభాగాధిపతి ఆచార్య పి.పూర్ణచంద్ర రావు తెలిపారు.

ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శన



పొన్నూరు: మండలం గోళ్లమూడిపాడులోని నాట్కో స్కూల్ ఆఫ్ లెర్నింగ్ పాఠశాల 14 వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ముఖ్య అతిథులుగా నాట్కో ఫార్మా డిప్యూటీ జనరల్ మేనేజర్ పల్నాటి నర్మదా, హిప్పో క్యాంపస్ స్కూల్ వైస్ ప్రెసిడెంట్ లలితా రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా నర్మదా మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక రంగాలలో రాణించాలని అన్నారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. అనంతరం ఆటల పోటీలు, నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో తుమ్మల ఆనంద్ బాబు, నాట్కో ట్రస్ట్ మేనేజర్ వంశీ, ఇన్‌చార్జి కె.రమణా రెడ్డి, ఉదయకుమార్, మహేష్, పూర్వ విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్ ఉమ్రి, ప్రిన్సిపల్ లావణ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

గుంటూరు రూరల్: విద్యుత్ సబ్‌స్టేషన్‌లలో మరమ్మతులు, ఇతర సమస్యల పరిష్కారం వలన పలు ప్రాంతాల్లో సరఫరాలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. పొత్తూరు సబ్ స్టేషన్ పరిధిలోని పొత్తూరు, నాయుడుపేట, ఓబులనాయుడుపాలెం, లింగాయపాలెం, కేవీపీ కాలనీ పరిధిలో శ్రీనివాసరావుతోట, ఎమ్‌జీ నగర్, 60 అడుగుల రోడ్డు, కృష్ణబాబుకాలనీ, జోసెఫ్‌కాలనీ, వివిపీ రోడ్డు, చుట్టుగుంట, లాలుపురం, వైజంక్షన్, తదితర ప్రాంతాల్లో వినియోగదారులు సహకరించాలని కోరారు.

చేబ్రోలు: విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా శనివారం సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బి.శ్రీనివాసరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని చేబ్రోలు, వడ్లమూడి విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు సరఫరాను ఉండదని చెప్పారు. వినియోగదారులు సహకరించాలని ఏఈ కోరారు.

ఉప్పరపాలెంలో మినీ గోకులం షెడ్డు ప్రారంభం

పొన్నూరు: పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉప్పరపాలెం గ్రామంలో నూతనంగా నిర్మించిన మినీ గోకులం షెడ్డు (పశువుల షెడ్డు)ను శుక్రవారం ప్రారంభించారు. ఎంపీడీఓ చంద్రశేఖర్ మాట్లాడుతూ రూ.2.30 లక్షల విలువతో 27 మంది లబ్ధిదారులకు మండలంలో మినీ గోకులాలు మంజూరు చేసినట్లు అధికారులు వెల్లడించారు.

అంగన్‌వాడీ కేంద్రంలో కళాజాతా

గుంటూరు రూరల్: ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలోని వెంగళాయపాలెం సెక్టార్ వెంగళాయపాలెం అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం కళాజాతా కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా బేటీ బచావో, బేటీ పడావో(బాలికలను రక్షిద్దాం – బాలికలను చదివిద్దాం) అనే కళాజాతా ప్రదర్శన చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచి లలితకుమారి పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

లయోలాలో అబ్బురపరిచిన విద్యావైజ్ఞానిక సదస్సు

గుంటూరు రూరల్: విద్యా వైజ్ఞానిక సదస్సులను నిర్వహించటం వలన విద్యార్థుల్లోని సృజనాత్మకతను మెరుగు పరచవచ్చని లయోలా పాఠశాల ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ సురేష్‌కుమార్ తెలిపారు. శుక్రవారం నల్లపాడు గ్రామంలోని లయోలా పాఠశాలలో దైవారాధనతో విద్యావైజ్ఞానిక సదస్సును ప్రారంభించారు. పాఠశాల సుపీరియర్ కరస్పాండెంట్ రెవరెండ్ ఫాదర్ డాక్టర్ పోతిరెడ్డి అంతోని మాట్లాడుతూ వైజ్ఞానిక ప్రదర్శనలో రోబోటిక్స్, వర్చువల్ రియాలిటీ, డ్రోన్ టెక్నాలజీ, వైర్‌లెస్ పవర్ ట్రాన్స్‌ఫర్ సిస్టమ్ ప్రేక్షకులను ఎంతో ఆకట్టుకున్నాయన్నారు. పాఠశాల పూర్వ విద్యార్థి జీవీఎస్ రాహుల్‌రెడ్డి మాట్లాడారు. విద్యార్థులకు ముగ్గులపోటీలు నిర్వహించారు. భోగి మంటలు, భోగిపండ్లు, సంక్రాంతి గాలిపటాల ఎగురవేత తదితర కార్యక్రమాలు విద్యార్థుల తల్లిదండ్రులను అలరించాయి. కార్యక్రమాలను పాఠశాల వైస్ ప్రిన్సిపాల్ రెవరెండ్ ఫాదర్ పీ నరేష్ పర్యవేక్షించారు.

నంబూరు గ్రామ నమూనాను రూపకల్పన

పెదకాకాని: నంబూరు నమూనాను రూపొందించిన వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామస్తుల మన్ననలు పొందారు. గ్రామీణ వృత్తులపై అవగాహన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కేఎల్‌యూ వ్యవసాయ కళాశాల విద్యార్థులు నంబూరులో పర్యటించారు. గ్రామీణ భాగస్వామ్యం విశ్లేషణలో భాగంగా గ్రామంలోని శ్రీనాగారపమ్మ ఆలయ ప్రాంగణంలో నివాసాలు, పంట పొలాలు, ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, పంట కాలువలను చూపిస్తూ రకరకాల రంగులతో రంగవల్లులు అలంకరించారు.

ఇళ్లు లేని పేదలకు స్థలాలు ఇవ్వాలి

గుంటూరు రూరల్: కూటమి ప్రభుత్వం పేద ప్రజలకు ఎన్నికల్లో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా తహసీల్దార్ కార్యాలయాల్లో పేదల నుంచి సేకరించిన అర్జీలను అధికారులకు ఇచ్చే కార్యక్రమంను గుంటూరు పశ్చిమ తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఐ నగర సమితి ఆధ్వర్యంలో నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు పేదల నుంచి సేకరించిన అర్జీలను అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి కోట మాల్యాద్రి, నాయకులు మేడా హనుమంతరావు, నగర కార్యవర్గ సభ్యులు జి.సురేష్ బాబు, ఆకేటి అరుణ్‌కుమార్, రావుల అంజిబాబు, చల్లా మరియాదాస్, ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు జంగాల చైతన్య, నగర సమితి సభ్యులు పి జగన్నాథం, ఇరిగినేని వెంకటేశ్వరరావు, దుపాటి రత్నం, జైద్ మున్నా, దత్తు, గోపాల్ పాల్గొన్నారు.

పొన్నూరులో...

పొన్నూరు: కూటమి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని సీపీఐ కార్యదర్శి పుప్పాల సత్యనారాయణ, జిల్లా ప్రజా నాట్య మండలి కార్యదర్శి ఆరేటి రామారావు అన్నారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ శుక్రవారం సీపీఐ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి షేక్ గౌస్, దేవరకొండ శ్రీనివాస్, బుల్లి వెంకయ్య, వెంకాయమ్మ రజిని, రామలక్ష్మీ, సుబ్బమ్మ, కోటేశ్వరమ్మ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పెదకాకాని: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని గుంటూరు జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు కొల్లి రంగారెడ్డి అన్నారు. సీపీఐ రాష్ట్ర పిలుపు మేరకు శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి గ్రామ కార్యదర్శి పాటిబండ్ల డేవిడ్‌రాజు అధ్యక్షత వహించారు. అనంతరం డెప్యూటీ తహసీల్దార్ ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి రెంటాల కుమారి పాల్గొన్నారు.

విజ్ఞాన్‌లో ఘనంగా సిస్కో థింగ్‌క్యూబేటర్ ఇన్నోవేషన్ మేళా




సర్టిఫికెట్లు అందజేస్తున్న నా స్కామ్ ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ సహాన్ రాజ్

చేబ్రోలు: మండలం వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలో సిస్కో థింగ్‌క్యూబేటర్ ఇన్నోవేషన్ మేళా-2025ను ఘనంగా నిర్వహించారు. రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని విజ్ఞాన్ వర్సిటీలోని టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్, ఈ-సెల్, నాస్కామ్ సంయుక్త ఆధ్వర్యంలో సిస్కో ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేశారు. నాస్కామ్ ఫౌండేషన్ ఇన్నోవేషన్ మేనేజర్ సహాన్ రాజ్ మాట్లాడుతూ సిస్కో థింగ్‌క్యూబేటర్ ఇన్నోవేషన్ మేళా-2025 ద్వారా విద్యార్థుల్లో ఆవిష్కరణల సామర్థ్యాన్ని పెంపొందించడానికి మరియు వ్యాపారాత్మక ఉత్సాహాన్ని కలిగించడానికి ఒక డైనమిక్ వేదికగా నిలుస్తుందన్నారు. ఇన్నోవేషన్ మేనేజర్ అల్‌బర్ట్ డైలన్ మాట్లాడుతూ యువ ఆవిష్కర్తలకు మెంటారింగ్ మరియు పరిశ్రమ నిపుణులతో నెట్‌వర్కింగ్ అవకాశాలను కల్పిస్తామన్నారు. అనంతరం ఐడియథాన్ పోటీ నిర్వహించారు. విద్యార్థుల నుంచి వచ్చిన 256 ఐడియాలలో అత్యుత్తమమైన 10 టీమ్‌ల ఆవిష్కరణల పరిష్కారాలను తుది పోరుకు అర్హత సాధించారని వెల్లడించారు. విజేతలుగా నిలిచిన విద్యార్థులకు మొదటి బహుమతి రూ.10,000, రెండవ బహుమతి రూ.5,000, మూడో బహుమతి రూ.3,000 అందజేశారు. అనంతరం వారి ఐడియాలను ప్రోడక్ట్ రూపంలో వినియోగంలోకి తీసుకురావడానికి రూ.5 లక్షల సీడ్ గ్రాంట్‌ను కూడా మంజూరు చేస్తారు.

కక్ష సాధింపు చర్యలకు పాల్పడితే ఉపేక్షించేది లేదు

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్



ఏసుబాబును పరామర్శిస్తున్న కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: కక్షసాధింపు చర్యలకు పాల్పడితే ఎవ్వరినైనా ఉపేక్షించేది లేదని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఇటీవల టీడీపీ నాయకుల దాడిలో గాయపడి గుంటూరు ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న కొండెపాటి ఏసుబాబును ఆయన పరామర్శించారు. బలసాని మాట్లాడుతూ వైఎస్సార్ సీపీలో చురుకుగా పాల్గొంటున్నాడని అక్కసుతో వంగిపురం గ్రామ సర్పంచి, అతని కొడుకు, కొంతమంది తెలుగుదేశం పార్టీ నాయకులు, ఏసుబాబును బెదిరించి, ఊరు పేరు లేని ఒక కానిస్టేబుల్‌తో ఫోన్ చేయించి నీ అంతూ చూస్తామని బెదిరించారని తెలిపారు. ఆ మాటలకు భయపడిన ఏసుబాబు ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడన్నారు. వైఎస్సార్ సీపీ ప్రతి కార్యకర్తకు అండగా ఉంటుందని తెలిపారు.

ముందస్తు సంక్రాంతి సంబరాలు



కిట్స్ ఇంజినీరింగ్‌లో విద్యార్థినుల కోలాట ప్రదర్శన



కళ్లం ఇంజినీరింగ్‌లో ముగ్గల పోటీ

నియోజకవర్గంలోని వివిధ కళాశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముగ్గులు పోటీలు నిర్వహించారు.

-సాక్షి నెట్‌వర్క్



చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోజరిగిన ముగ్గుల పోటీలో పాల్గొన్న విద్యార్థులు

ఉపాధిహామీలో అవినీతిని అరికట్టాల్సిందే

ప్రత్తిపాడు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో అవినీతిని అధికారులు అరికట్టాలని గుంటూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కల్లూరి శ్రీనివాసరావు అన్నారు. ప్రత్తిపాడు మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ దాసరి అన్నమ్మ అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో కల్లూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ పథకానికి వేల కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. కార్డులు ఉన్నా గ్రామాల్లో ఉండకుండా హైదరాబాద్, గుంటూరుల్లో ఉంటున్న వారికి కూడా మస్టర్లు పడుతున్నాయని అన్నారు. ఇక నుంచి జరిగే పనుల్లో ఎక్కడా ఒక్క చోట కూడా అవినీతి జరగకుండా పనులు జరగాలని, ఆవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

సమావేశాల సమాచారం ఇవ్వరా..

మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించే అధికారిక కార్యక్రమాలు, సమావేశాల సమాచారం ఎంపీటీసీ సభ్యులకు ఇవ్వరా.. అంటూ వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు అధికారులను ప్రశ్నించారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో గనికపూడి సురేష్, నడింపాలెం ఎంపీటీసీ మాణిక్యరావులు సమావేశాలకు కనీస సమాచారం ఇవ్వకపోవడం ఏమిటని ఎంపీడీఓను ప్రశ్నించారు. అదేవిధంగా సర్వసభ్య సమావేశాల అజెండాతో పాటు నిధులు, ఖర్చుల వివరాలను కూడా తెలియజేయాలని కోరారు. జెడ్పీటీసీ వి.కృష్ణారెడ్డి మాట్లాడుతూ సమావేశాల సమాచారం ఎంపీటీసీలు, ఎంపీపీ, జెడ్పీటీసీలకు ఇస్తే వారు కూడా ప్రజా సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చే అవకాశం ఉంటుందన్నారు. సానుకూలంగా స్పందించిన ఎంపీడీఓ కె.శివపార్వతి ప్రతి సమావేశాన్ని ఎంపీటీసీ సభ్యులకు తెలియజేస్తున్నామన్నారు.